క్లుప్తంగా

నటుడు చంద్రమోహన్‌కు స్వరలయ నివాళి



తెనాలి: తెలుగు సినిమా పరిశ్రమలో 800 సినిమాల్లో ఎన్నో వైవిధ్యమైన పాత్రలకు జీవం పోసిన నటుడు చంద్రమోహన్ మరణం తెలుగు చిత్రసీమకు తీరని లోటని స్వరలయ వేదిక వ్యవస్థాపకుడు, రచయిత సాయి లక్కరాజు అన్నారు. సుప్రసిద్ధ నటుడు చంద్రమోహన్ సంతాపసభను శనివారం సాయంత్రం స్వరలయ వేదిక కార్యాలయంలో నిర్వహించారు. చంద్రమోహన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. గుంటూరు జిల్లా బాపట్లలో చంద్రమోహన్ అనేక నాటకాలు వేసినట్టు గుర్తుచేశారు. ఆయనతో తనకు కుటుంబ అనుబంధం ఉందన్నారు. శ్రీధర్, నటులు హేమంత్, శ్రీనివాస్, విశ్రాంత అధికారి రమణయ్య, బ్యాంక్ ఉద్యోగ సంఘ నేత రావిపాటి ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ



తెనాలిటౌన్: బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మ సేవా శాంతి ఆశ్రమం, నాజరుపేటలోని మన ఇల్లు వృద్ధాశ్రమంలో శనివారం శ్రీ విద్యాపీఠం నిర్వాహకులు పూజ్యశ్రీ బాలస్వామిజీ జన్మదినోత్సవ వేడుకలను శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమాలలోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి అన్నదానం చేశారు. మహాత్మ ఆశ్రమంలో బాలస్వామిజీ వృద్ధులతో మాట్లాడి ప్రవచనం చేశారు. ఎస్వీయోగ కన్వీనర్ ఎం.రమణయ్య పర్యవేక్షణలో శ్రీ విద్యాపీఠంలో చంద్రమౌళేశ్వర స్వామికి 27కిలోల తేనెతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆశ్రమాల నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, భారతి, మురళి, సాలిగ్రామ మఠం జాయింట్ సెక్రటరీ రమణయ్య, భక్తులు, యోగసాధకులు పాల్గొన్నారు.

పంచారామాలు, శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

తెనాలిఅర్బన్: కార్తికమాసాన్ని పురస్కరించుకుని పంచారామాలు, శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ తెనాలి డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. పంచారామాలైన సామర్లకోట, ద్రాక్షారామం, పాలకొల్లు, భీమవరం, అమరావతిలకు కార్తికమాసంలో ప్రతి శనివారం సాయంత్రం ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు చెప్పారు. అలాగే శైవ క్షేత్రాలైన యాగాటి, మహానంది, శ్రీ శైలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. అరుణాచలం, శ్రీ కాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపులు, శబరిమలై వెళ్ళే అయ్యప్ప భక్తుల కోసం ప్రత్యేక బస్సు సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివరాలకు తెనాలి ఆర్టీసీ డిపో ఫోన్ నెంబర్ 7382897598, 7382892492 లలో సంప్రదించాలని సూచించారు.

29న మహా కుంభాభిషేకం

పొన్నూరు: పట్టణంలోని శ్రీ సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత శ్రీ సాక్షి భావనారాయణ స్వామి అష్టబంధన మహా కుంభాభిషేకాన్ని ఈ నెల 27 నుంచి 29 వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ధర్మకర్తల మండలి సభ్యురాలు కిలారి లక్ష్మీ సరస్వతి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో శనివారం కార్యక్రమాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మీ సరస్వతి మాట్లాడుతూ 27న ఉదయం 9 గంటలకు విష్వక్సేన ఆరాధనతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ప్రతిరోజు ప్రత్యేక పూజలు, హోమాలు జరుగుతాయన్నారు. 29న ఉదయం 9.05 గంటలకు మహా కుంభాభిషేకం జరుగుతుందని తెలిపారు. స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సభ్యులు పల్లికల శ్యామ్, మంద్రు అనిత, అర్చకులు రఘునాథబాబు, పులిపాక ప్రసాద్, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



గొప్ప దేశభక్తుడు అబుల్ కలాం ఆజాద్

జయంతి వేడుకలో ఎమ్మెల్యే శివకుమార్



అజాద్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: ప్రముఖ రాజనీతిజ్ఞుడు, విద్యావేత్త, రచయిత మౌలానా అబుల్ కలాం అజాద్ బాటలోనే ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి పాఠశాల విద్యలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చినట్టు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. స్థానిక గంగానమ్మపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అబుల్ కలాం అజాద్ జయంతిని శనివారం జరిపారు. పార్టీ నేతలతో కలిసి అజాద్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ, దేశంలో యూజీసీ, ఐఐటీ వంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థలు భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా చేసిన అబుల్ కలాం అజాద్ ఆలోచనల నుంచి రూపుదిద్దుకున్నవేనని గుర్తుచేశారు. అందుచేతనే ఆయన జన్మదినాన్ని జాతీయ అక్షరాస్యతా దినోత్సవంగా జరుపుకుంటున్నామని గుర్తుచేశారు. అలాంటి మహానేతల స్ఫూర్తితో పాఠశాల విద్యలో సమూల మార్పులు తీసుకొస్తూ మన విద్యార్థులు ప్రపంచ విద్యార్థులతో పోటీపడేలా ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. అబుల్ కలాం అజాద్ గొప్ప దేశభక్తుడనీ, బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడిన ముస్లిం దేశభక్తుల్లో అజాద్ అగ్రగణ్యులని చెప్పారు. అప్పట్లో దేశ విభజనను ఆయన తీవ్రంగా వ్యతిరేకించినట్టు తెలిపారు. అజాద్ స్ఫూర్తితో యువతరం దేశభక్తిని అలవరచుకోవాలని అభిప్రాయపడ్డారు. వైఎస్సార్ సీపీ క్లస్టర్-2 అధ్యక్షుడు, కౌన్సిలర్ షేక్ దుబాయ్‌బాబు మాట్లాడుతూ భారతదేశ తొలి మంత్రివర్గంలో పదేళ్లపాటు విద్యాశాఖ మంత్రిగా చేసిన అజాద్, విద్యారంగంలో తీసుకొచ్చిన సంస్కరణలు గొప్పవని చెప్పారు. పార్టీ నాయకులు అక్కిదాసు కిరణ్‌కుమార్ సయ్యద్ గౌస్ తమ ప్రసంగాల్లో అజాద్ దేశభక్తిని కొనియాడారు. పార్టీ క్లస్టర్-1 అధ్యక్షుడు మద్దాళి శేషాచలం, తాడిబోయిన రమేష్, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభాని, షేక్ అన్సారీ, హోటల్ సుభాని, షేక్ నూర్ ఇస్మాయిల్, సిలార్‌జానీ, సాదిక్, దౌలత్, షేక్ మీరావలి, టెకేన బాల, సర్దార్, కౌన్సిలర్లు దాసరి వసంతరావు, తాడిబోయిన రామయ్య, ఆవుల కోటయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో...

తెనాలిటౌన్: జాతీయ ఉద్యమ నాయకుడు, రాజనీతిజ్ఞుడు మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి వేడుకలను శనివారం మారీసుపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిపారు. తెనాలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ డాక్టర్ చందు సాంబశివుడు ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమ పోరాటంలో ఆజాద్ పాల్గొని దేశానికి స్వాతంత్ర్య వచ్చే వరకు ఉద్యమించాడని డాక్టర్ సాంబశివుడు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పొన్నూరు నాగసూర్యశశిధరరావు, పి.శివకుమార్, నామన మల్లికార్జునరావు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

26న రజక ఆత్మగౌరవ సభ

జయప్రదం చేయాలని రజక సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు అంజిబాబు వినతి



పోస్టర్‌ను ఆవిష్కరించిన అంజిబాబు, రజక సంఘాల నేతలు

తెనాలి: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట మైదానంలో ఈనెల 26వ తేదీన సాయంత్రం ఆరు గంటలకు తలపెట్టిన రజక ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని రజక సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు పాతపాటి అంజిబాబు కోరారు. సభలో రజకుల సమస్యలపై చర్చించి, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు తెలిపారు. స్థానిక ఎన్జీవో కళ్యాణమండపంలో శనివారం సన్నాహక సమావేశాన్ని నిర్వహించి, ఆత్మగౌరవ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం రజకులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని, రజకులకు రక్షణ చట్టం తీసుకురావాలనీ, రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలన్న డిమాండ్లతో తలపెట్టిన ఆత్మగౌరవ బహిరంగ సభకు రాష్ట్రవ్యాప్తంగా లక్షమంది హాజరుకానున్నట్టు చెప్పారు. అన్ని ప్రాంతాల్నుంచి రజక సోదరులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఆర్‌వీఎస్ అధ్యక్షుడు పోతార్లంక ప్రసాద్, కార్యదర్శి పి.శ్రీనివాస్, కౌన్సిలర్లు పెదలంక లక్ష్మీలావణ్య, వీర్లపాటి విజయలక్ష్మి, మార్కెట్‌యార్డు డైరెక్టర్ ధరణికోట నాగమల్లేశ్వరి, పెదలంక వెంకటేశ్వర్లు, మేడేపల్లి ప్రభాకర్ మాట్లాడారు. రజక సంఘ నాయకుడు మునిపల్లి వంశీ పర్యవేక్షించారు.

చిన్నారులకు పౌష్టికాహారం కిట్ల పంపిణీ

గుంటూరు మెడికల్: స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు వచ్చి చిన్నారులకు పౌష్టికాహారం, భోజన సదుపాయం కల్పించడం అభినందనీయమని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి శుశ్రుత హాలులో శనివారం ప్రాణాంతకమైన వ్యాధికి గురైన చిన్నారులకు, తల్లిదండ్రులకు పౌష్టికహారం కిట్లను ఏఆర్‌టీ సెంటర్ ఆధ్వర్యంలో ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ సమాజ సేవ చేయడం కూడా అదృష్టంగా భావించాలని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, డాక్టర్ రవి, సత్యనారాయణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అలరించిన దీక్షితార్ కీర్తనలు



గానం చేస్తున్న శ్రీనివాస్ శర్మ

తెనాలి: రామలింగేశ్వరపేటలోని శ్రీ దుర్గా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం సాయంత్రం సంగీత సభ నిర్వహించారు. సంగీత జగద్గురు సేవా సమితి ఆధ్వర్యంలో సంగీత త్రిమూర్తులలో ఒకరైన శ్రీ ముత్తుస్వామి దీక్షిత్ వర్ధంతి సందర్భంగా సంగీత సాహిత్య ప్రవీణ, శృతివాగ్గేయ కళానిధి యనమంద్ర శ్రీనివాస్ శర్మచే శ్రీ ముత్తుస్వామి దీక్షిత్ గురించి సోదాహరణ ప్రసంగం తో కూడిన సంగీత కార్యక్రమం చక్కగా జరిగింది. శ్రీనివాస్ శర్మ ముత్తుస్వామి దీక్షిత్ వారి జీవిత చరిత్ర, వారు సంగీతానికి చేసిన సేవ గురించి విశేషంగా చెప్పారు. ముత్తుస్వామి దీక్షిత్ పలు సంగీత కీర్తనలు ఆలపించారు. వయోలిన్ పై చావలి శ్రీనివాస్, మృదంగంపై కానూరి వెంకట రామకృష్ణ వాద్య సహకారం అందించారు. అనంతరం సంగీత జగద్గురు సేవా సమితి తరఫున డాక్టర్ చింతలపాటి మంజుల, యనమండ్ర శ్రీనివాస్ శర్మను ఘనంగా సత్కరించినారు. పర్చూరు సుబ్బారావు, కొండపి శ్రీనివాసరావు, ఎస్వీ చంద్రశేఖర్, నల్లూరు శ్రీనివాస్, తెనాలి సంగీత ప్రియులు, సంగీత గురువులు పాల్గొన్నారు. డాక్టర్ చింతలపాటి మంజుల పర్యవేక్షించారు.

టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్త అవసరం



వ్యాపారస్తుడికి కరపత్రాన్ని అందిస్తున్న అధికారి ప్రసాద్

పొన్నూరు: బాణసంచా కాల్చే సమయంలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని పొన్నూరు అగ్నిమాపక శాఖ అధికారి ప్రసాద్ సూచించారు. పట్టణంలో శనివారం ఏర్పాటు చేసి తాత్కాలిక స్టాల్స్‌ను ఆయన పరిశీలించి, వ్యాపారులకు పలు సూచనలు చేశారు. ప్రజలంతా దీపావళి సంతోషంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. చేతిలో టపాసులు, తారాజువ్వలు పట్టుకుని కాల్చవద్దని సూచించారు. ఒక్కోసారి చేతిలోనే పేలే ప్రమాదం ఉందని తెలిపారు. చిన్నారులు టపాసులు కాల్చే సమయంలో తల్లిదండ్రులు దగ్గరుండాలని చెప్పారు. గర్భిణులు పొగ పీల్చకుండా మాస్కులు ధరించాలని సూచించారు. పిల్లలు, యువత, పెద్దలందరూ చేతికి గ్లౌజులు, కళ్లద్దాలు ధరించాలన్నారు. ముందు జాగ్రత్తగా నీటిని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అనంతరం వ్యాపారస్తులకు జాగ్రత్తల్ని తెలిపే కరపత్రాల్ని పంపిణీ చేశారు.

హైడ్రోఫోనిక్స్ వ్యవసాయంపై అవగాహన అవసరం

కళాశాల ఏడీ డీడీ స్మిత్



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కళాశాల అసోసియేట్ డీన్ డీడీ స్మిత్

బాపట్ల: హైడ్రోఫోనిక్స్ వ్యవసాయంపై అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి.డి.స్మిత్ తెలిపారు. వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం హైడ్రోఫోనిక్స్ నూతన వ్యవసాయ శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది. హైదరాబాద్‌లోని ఐఏఏ ఫామ్స్ లిమిటెడ్, గ్రో ఫ్రైజ్ ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి వచ్చిన డాక్టర్ ఎం.సత్యనారాయణ రెడ్డి, డాక్టర్ ఎ.లక్ష్మిల నైపుణ్యంతో ఈనెల 8 నుంచి 11 వరకు హైడ్రోఫోనిక్స్ అనే నూతన వ్యవసాయ విధానంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో విద్యార్థులకు హైడ్రోపోనిక్స్‌లోని ప్రతి అంశం గురించి వివరించడమే కాకుండా ప్రతి విద్యార్థితో ప్రాక్టికల్ చేయించారు. డాక్టర్ డీడీ స్మిత్ మాట్లాడుతూ రాష్ట్రం నలుమూలల నుంచి 86 మంది విద్యార్థులు ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొనడం హర్షణీయమన్నారు. ఫుడ్ అండ్ సైన్స్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సీహెచ్ వి.వి.సత్యనారాయణ మాట్లాడుతూ భవిష్యత్తు తరాలలో వాతావరణంలోని మార్పులతో, పర్యావరణ సమస్యలతో సంబంధం లేకుండా వ్యవసాయంలో హైడ్రోఫోనిక్స్ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. అదేవిధంగా పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ సెంటర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ అండ్ హెడ్ డాక్టర్ బీవీఎస్ ప్రసాద్ మిద్దె సాగు గురించి వివరించారు. డాక్టర్ బి.జాన్ వెస్లీ హైడ్రో ఫోనిక్స్ యొక్క ప్రత్యేకతను విద్యార్థులకు వివరిస్తూ భవిష్యత్తులో ఇటువంటి శిక్షణ కార్యక్రమం ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అనంతరం శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్స్‌ను అందజేశారు. డాక్టర్ ఆర్.గణేష్ బాబు, డాక్టర్ కె.కృపావతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఎస్‌హెచ్‌వోలో ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: డయాబెటిక్ నిరోధక మాసం సందర్భంగా సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ (ఎస్‌హెచ్‌ఓ), మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు 'మెదడు, నరముల వ్యాధుల ఉచిత వైద్య శిబిరం, శాస్త్రీయ అవగాహన సభ' నిర్వహిస్తున్నట్టు సంస్థల అధ్యక్షులు డాక్టర్ తాతా సేవకుమార్, పావులూరి రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరులోని 2/1 బ్రాడీపేటలో గల ఎస్‌హెచ్‌వో బిల్డింగ్‌లో నిర్వహించే వైద్య శిబిరంలో వైద్య నిపుణుడు డాక్టర్ నటరాజ పాల్గొంటారని పేర్కొన్నారు. నగర ప్రజలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు కోరారు.